

'పెండింగ్ డీఏలను వెంటనే చెల్లించాలి'

కందుకూరు, ఆగస్టు 12: పెండింగ్‌లోని ఐదు డీఏలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం సంఘం మండల ఉపాధ్యక్షుడు జి.బుచ్చయ్యగుప్తా ఆధ్వర్యంలో లేమూరు, తిమ్మాపురం, ఆకులమైలారం, మీర్కాన్‌పేట, ముచ్చర్ల, కందుకూరు, గూడూరు, రాచులూరు గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్ నాయక్, సల్మాన్, గోవర్ధన్, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, లక్ష్మారెడ్డి, మల్లికార్జున్, హరిప్రసాద్, రాము గౌడ్, జయసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాచకొండకు రాజయోగం పట్టనుందా? అంటే ప్రభుత్వ వర్గాల నుంచి అవుననే సమాధానం వినిపిస్తోంది. ప్రధానంగా ఈ ప్రాంతం అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇక్కడ ప్రకృతి అందాలకు మెరుగులు దిద్ది ఊటీని తలపించేలా సిద్ధం చేయాలనే చర్చ నడుస్తున్నట్లు సమాచారం. అలాగే రామోజీ ఫిలింసిటీని తలదన్నేలా మరో ఫిలిం సిటీని ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతం కనుచూపు మేరలో కనిపించే కొండలు కోనలు, నీటి పరవళ్లు, దట్టమైన అడవులు పచ్చటి మైదానాలతో సహజ సిద్ధ పర్యాటక కేంద్రంగా చూసేవారిని ఇట్టే కట్టిపడేస్తుంది. ఇక్కడి ప్రదేశాలను చూస్తే రాజరిక పాలనకు సంబంధించిన ఆనవాళ్లు అడగడుగునా దర్శనమిస్తాయి. అరుదైన ఆయుర్వేద మూలికల నిక్షేపాలకు ఈ ప్రాంతం అడ్డాగా గుర్తింపు. రాచకొండను అభివృద్ధి చేస్తే యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడటంతో పాటు ఇక్కడి భూములు బంగారమవుతాయని స్థానికులు పేర్కొంటున్నారు.



రాచకొండకు రాజయోగం!



గలగలపారుతున్న సెలయేరు


అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన సీఎం

- ఊటీని తలపించేలా ప్రకృతి అందాలకు మెరుగులు
- ఫిలిం సిటీ ఏర్పాటుకు ప్రణాళిక
- సహజసిద్ధ పర్యాటక కేంద్రంగా గుర్తింపు
- శత్రుదుర్భేద్యంగా అలనాటి అంతఃపురం, కోటగోడలు
- అరుదైన ఆయుర్వేద మూలికల నిక్షేపాలకు అడ్డా

మంచాల, ఆగస్టు 12: రాచకొండ ప్రాంత అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నజర్ పెట్టినట్లు తెలుస్తోంది. ఇటీవల ఓ సభలో ఇక్కడి ప్రాశస్త్యాన్ని గుర్తుచేస్తూ సాగిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగం ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. ఈ ప్రాంతంపై తన అనుభూతిని వివరిస్తూ ఇబ్రహీంపట్నం నుంచి మునుగోడుకు మధ్య అటవీ ప్రాంతాన్ని చూస్తే ఊటీని తలపించేదిగా ఉంటుందంటూ చెప్పడం గమనార్హం. సమీపంలోని రామోజీ ఫిలిం సిటీ సినిమా షూటింగులకు నెలవుగా ఉందని అలాగే రాచకొండ ప్రాంతంలోనూ మరో ఫిలిం సిటీని ఏర్పాటు చేస్తే దేశవిదేశాలకు చెందిన సినిమాలు ఇక్కడ రూపుదిద్దుకుంటాయని సీఎం ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఫిలింసిటీ ఏర్పాటుకు కృషి చేస్తానంటూ హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటనతో సమీప ప్రాంత ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. రాచకొండ ప్రాంత అభివృద్ధిపై కార్యాచరణను చేపట్టాలంటూ విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి.

రాతిబండలను తొలిచి ఆలయాల నిర్మాణాలు

రాచకొండ ప్రాంతం కనుచూపు మేరలో కనిపించే కొండలు కోనలు, నీటి పరవళ్లు, దట్టమైన అడవులు పచ్చటి మైదానాలతో సహజ సిద్ధ పర్యాటక కేంద్రంగా చూసేవారిని ఇట్టే కట్టిపడేస్తుంది. ఇక్కడి ప్రదేశాలను చూస్తే రాజరిక పాలనకు సంబంధించిన ఆనవాళ్లు గోచరిస్తాయి. 15వ శతాబ్దంలో రాచకొండను రాజధానిగా చేసుకుని పాలన సాగించారు. అప్పటి చక్రవర్తి సింహభూపాలుడిచే ఈ రాజధాని నిర్మాణం సాగిందని చరిత్రకారులు చెబుతారు. వీరి పాలనా కాలంనాటి శాసనాలు ఇక్కడి రాతిబండలపై చెక్కబడి ఉన్నాయి. వాటి ద్వారా పట్టణ అనుభూతి కలిగేలా రాచకొండ నిర్మాణం జరిగిందని చెప్పవచ్చు. వేలాది ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ ప్రాంతంలో అక్కడక్కడ గ్రామాల అనవాళ్లు, ప్రజల నిత్యావసరాలకు వినియోగించే రాతి రోళ్లు తదితర వస్తువులు కనబడతుంటాయి. రాచకొండ పాలకులు దైవభక్తి గలవారు. వీరు విగ్రహారాధకులు కావడంతో అప్పట్లో నిర్మించిన దేవాలయాలు ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి. రాతిబండలను తొలచి దేవాలయ కట్టడాలు, విగ్రహాలుగా మలచి ఉండడం చూసేవారిని అబ్బుర పరుస్తాయి.



రాచకొండ కోట

సంకెళ్ల బావిలో ధన భాండాగారం

సుమారు రెండుమూడు వందల ఎకరాల విస్తీర్ణంతో ఎత్తైన కొండలపై అంతఃపురం నిర్మించబడి ఉంది. ఈ అంతఃపురం చుట్టూ రాతి కోటగోడ ఉంది. ఇది రాతి గోడలతో శత్రుదుర్భేద్యంగా రూపొందించారు. ఏడు ముఖ ద్వారాలతో ఈ అంతఃపురం ఏర్పాటు చేయబడి ఉంది. ఒక్కో ముఖ ద్వారానికి ఒక్కో నేపథ్యం ఉంటుంది. కోటగోడ లోపలే సేవకులు, సైనికులు, బాంఢాగారాలు, యుద్ధ సామగ్రి, గుర్రాలు ఇతరత్రా ఉండేలా ప్రత్యేకతను కలిగి ఉన్నాయి. ఇంకా కోటగోడ లోపల వ్యవసాయానికి అనువైన పొలాలు, చెరువులు కనిపిస్తాయి. కొండపైభాగాన కొలనులు దర్శమిస్తాయి. అక్కడక్కడా రాతితో నిర్మించబడ్డ రచ్చబండలు సైతం ఉన్నాయి. చిట్ట చివరగా ఏడవ ముఖ ద్వారం తర్వాతి ప్రదేశంలో రాజుగారి విడిది కేంద్రాలు, నీటి కొలనులు ఉంటాయి. ఇంకా సంకెళ్లబావిగా అంతుచిక్కని నీటికొలను ఉంటుంది. అప్పట్లో రాజులు ఈ సంకెళ్ల బావిలో ధన భాండాగారాలు దాచిపెట్టారని చెబుతారు. ఇందుకు సాక్ష్యంగా ఆ బావి నుంచి బండపై గొలుసులు కట్టి లాగిన అనవాళ్లు కనిపిస్తాయి. పైగా ఈ సంకెళ్లబావి నుండి తంగడిపల్లి ప్రాంతానికి సొరంగమార్గం కూడా ఉండేదని చరిత్రకారులు చెబుతారు. కొండ కింది భాగంలో స్వయంభు శంభు లింగేశ్వర ఆలయం ఉంది. దేశంలోని మరెక్కడా లేని పరిమాణంలో శివలింగం ఉంటుంది. ప్రతియేటా శివరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.ఈ ఉత్సవాలను తిలకించేందుకు సమీప ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు.



రాచకొండ కోట ముఖ ద్వారం



అరుదైన పీటగుమ్మడి మూలిక

ప్రకృతి చికిత్సాలయ ఏర్పాటుకు వసతులు

వేల ఎకరాల్లో విస్తరించి ఉన్న ఇక్కడి అడవుల్లో ఆయుర్వేద వనమూలికల నిక్షేపాలు ఉన్నాయి. ఎక్కడో శ్రీశైలం నల్లమల అడవుల్లో లభించే అరుదైన ఔషధ మొక్కలు రాచకొండలోనూ లభ్యమవుతాయి. ఇక్కడ లభించే అర్జునార్షిష్టనే నల్లమద్ది చెట్టుగా పిలుస్తారు. ఈ వనమూలికను తింటే గుండెనొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. పలకజెమ్మడి ఔషధానికి మరో ప్రత్యేకత ఉంది. ఈ మూలిక కేన్సర్ నుండి విముక్తి లభిస్తుందని ఆయుర్వేద వైద్యులు చెబుతారు. బెరడు చుట్టూ ముళ్లతో ఉండే బ్రహ్మజెమ్ముడులోల తెల్లటి పాలద్రవం నిక్షిప్తమై ఉంటుంది. ఈ పాలమర్దనతో ఒళ్లు, కండరాల నొప్పులకు ఉపశమనం లభిస్తుంది.. ఇవిగాక దివ్యౌషధం ఎర్రతవిటి, రాగిహంస సాంబ్రాని, కొండపిండి ఆకు, రక్తాన్ని శుద్ధి చేసే మరెన్నో ఔషధాలు రాచకొండ అడవుల్లో లభిస్తాయి. ఈ క్రమంలో అడవుల సంరక్షణపై ప్రత్యేక దృష్టిపెట్టి ప్రకృతి చికిత్సాలయాన్ని నెలకొల్పితే ఉపయుక్తంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

హైవేకు అతి సమీపంలో

వేలాది ఎకరాల్లో విస్తరించి ఉన్న రాచకొండ ప్రాంతం సంస్థల ఏర్పాటుకు అనువైన ప్రదేశంగా చెబుతారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి పక్కనే ఉండడం అనుకూల అంశంగా పేర్కొనవచ్చు. అంతేగాకుండా ఓఆర్ఆర్ - ట్రిపుల్ ఆర్‌లకు మధ్యన ఈ ప్రాంతం ఉండడం కలిసి వచ్చే అంశం. మౌలిక వసతుల కల్పన సులభతరమౌతుంది. ఎవరైనా ఇక్కడికి సకాలంలో చేరుకోవచ్చు. రాచకొండలో ఫిలింసిటీ ఏర్పాటు చేస్త సమీప ప్రాంతాల్లో భూముల విలువలు అమాంతం పెరగడం ఖాయం. ఇంకా స్థానికులకు సైతం ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.



హర్ ఘర్ తిరంగా ర్యాలీలో ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి

దేశాభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలి

- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి

చేవెళ్ల, ఆగస్టు12: దేశాభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి ఆకాంక్షించారు. స్వాతంత్ర అమృత్ మహోత్సవంలో భాగంగా సోమవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు పత్తి సత్యనారాయణ ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ పానలలో దేశం అభివృద్ధి పథంలో ముందుకు దూసుకెళ్తుందన్నారు. దేశాభివృద్ధి నేటి యువతపై ఆధారపడి ఉందన్నారు. స్వాతంత్ర్య వేడుకలను పండగలాగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయలక్ష్మి, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, ఓబీసీ కార్యదర్శి అంజనేయులుగౌడ్, గౌండ్ల కృష్ణగౌడ్, అనంత్‌రెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, కుంచం శ్రీనివాస్‌గుప్తా తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

పకడ్బందీగా పంద్రాగస్టు వేడుకలు

- వీఐపీలు, అధికారులకు తగిన ఏర్పాట్లు చేయాలి
- తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక చొరువ తీసుకోవాలి
- జిల్లా అధికారులకు కలెక్టర్ శశాంక ఆదేశాలు

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 12 : పంద్రాగస్టు వేడుకలను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శశాంక అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. కొంగరకలాన్‌లోని కలెక్టరేట్‌లో నిర్వహించే ఈ వేడుకల్లో వీఐపీలు, అధికారులు, మీడియా, ఇతరులకు తగిన విధంగా సీటింగ్ ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ డివిజనల్ అధికారిని ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు, పారిశుధ్య ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్య అతిధి సందేశం రూపొందించేందుకు ఆయా శాఖలు సాధించిన ప్రగతి నివేదికలు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారికి వెంటనే పంపించాలని అన్నారు. వేడుకలకు వచ్చే అతిథికి పోలీసు గౌరవ వందనంతో పాటు వేడుకలలో పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. వేదికను అందంగా అలంకరించాలని ఉద్యానశాఖ అధికారులకు సూచించారు. విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని డీఈవోను ఆదేశించారు. స్టాల్స్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. వేడుకల ఏర్పాట్లలో ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, భూపాల్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా పరిషత్ సీఈవో కృష్ణారెడ్డి, అధికారులు, పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

- కుప్పలు తెప్పలుగా విజ్ఞప్తులు
- మొత్తం 160 అర్జీల స్వీకరణ
- ధరణి ఫిర్యాదులే అత్యధికం
- జనాలతో కిటకిటలాడిన కలెక్టరేట్

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 12: ప్రజావాణికి కుప్పలు తెప్పలుగా ఫిర్యాదులు వచ్చాయి. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి మొత్తంగా 160 అర్జీలు, ఫిర్యాదులు అందాయి. కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, భూపాల్‌రెడ్డితో పాటు డీఆర్వో సంగీత ప్రజల నుంచి స్వీకరించారు. ఈ ఫిర్యాదుల్లో అత్యధికంగా ధరణి సమస్యలే ఉండటం గమనార్హం. ధరణి కేంద్రం వద్ద జనాలు బారులు దీరారు. పని మానుకుని డబ్బులు ఖర్చు పెట్టుకుని ప్రజావాణికి వస్తున్నా.. సమస్యలు అపరిష్కృతంగానే ఉంటున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సమస్యలు వింటున్న కలెక్టర్ శశాంక



మా ఇళ్ల జాగా మాకు ఇప్పించండి

ఇళ్లు కట్టుకున్న స్థలానికి రైతు బంధు పడుతుందని ప్రజావాణిలో చేవెళ్ల మండలం జాలగూడ వాసులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జాలగూడ పరిధిలోని సర్వే నంబర్ 184లో తిరుమలి యాదయ్య, హన్మంత్, విఠలయ్య, యాదయ్య, టి. నారాయణ 5 గుంటల భూమి, సర్వే నెంబర్ 185లో పి. రాములు, కర్ణాకర్ రెడ్డి, నర్సింహారెడ్డి, గోపాల్‌రెడ్డి, టి. బుచ్చయ్య, టి. బీమయ్య 12 గుంటల భూమి, సర్వేనెంబర్ 186లో టి.మల్లేష్, నాగబూషణం, పి. కుమార్. పి. రాజ 14 గుంటల భూమిని అప్పట్లో కొనుగోలు చేశారు. 184 సర్వే నంబర్‌లో అత్తెల్లి మాధవరెడ్డి నలుగురికి 1971లో అమ్మాడు. అలాగే 185 సర్వే నంబర్‌లో ఆరుగురికి రాజమల్లారెడ్డి అనే వ్యక్తి 1997లో అమ్మాడు. 186 సర్వే నంబర్‌లో నలుగురికి 14 గుంటల భూమి శ్రీరాంరెడ్డి 1997లో అమ్మినట్లు కలెక్టర్‌తో తెలిపారు. ఆయా సర్వే నంబర్లలో మేమందరం ఇళ్లు కట్టుకుని జీవిస్తున్నట్లు, ధరణి వచ్చాక ఆయా రైతులకు రైతుబంధు పడుతుందని తెలిపారు. ఇళ్లు కట్టుకున్న ఈ స్థలాలను రిజిస్ట్రేషన్ చేయమంటే డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. ఆ ఇళ్ల జాగకు రైతుబంధు ఎలా ఇస్తారని వారందరూ ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా మరో 12 గుంటల భూమిని దొడ్ల జాగ కోసం పామెన రాములు, నారాయణ, నర్సింహులు, బుచ్చయ్య, బాల్‌రాజ్‌లకు అప్పట్లో డబ్బులు తీసుకుని స్టాంప్ పేపర్‌పై రాసి ఇచ్చారని, తిరిగి ఈ దొడ్ల జాగను లాక్కున్నట్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

వారసత్వ భూమి రికార్డుల్లో చేర్చాలి



వారసత్వ భూమి రావడం లేదు. రెండేళ్లుగా అధికారులు చుట్టూ తిరుగుతున్నాను. ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రజావాణిలో ఇప్పటికి రెండు సార్లు ఫిర్యాదు చేశాను. సమస్య అలాగే ఉంది. అమ్మానాన్నలు చనిపోయారు. నాన్న పేరిట ఉన్న భూమి అమ్మ పేరిట చేశారు. సర్వే నంబర్ 51లో ఒక ఎకరా ఒక గుంట భూమి రికార్డులో ఉంది. ఇంకా 14 గుంటల భూమి చేర్చాల్సి ఉంది. సమస్య పరిష్కారం అవుతందన్న నమ్మకంతో కలెక్టర్ కు సమస్యను వివరించాను.

-కె. వెంకటయ్య, తుమ్మలూరు గ్రామం, మహేశ్వరం మండలం

ఇప్పటికి పదిసార్లు ఫిర్యాదు చేశా



669, 670 సర్వే నంబర్లలో 26 గుంటల భూమి రికార్డుల్లో చూపిండం లేదు. మిస్సింగ్ సర్వే నంబర్ల కింద 2022, ఆగస్టులో మీ సేవలో దరఖాస్తు చేసుకున్నాను. అక్టోబర్ ఒకటిన అధికారులకు అందజేశాను. నాన్న అంజయ్య 2026లో చనిపోయాడు. భూమి అమ్మ పేరిట ఉంది. మా పెద్ద నాన్న పార్టిషియన్ చేసుకున్నాడు. అప్పటి నుంచి 26 గుంట భూమి రికార్డులలో కనిపించడం లేదు. అధికారులకు విన్నవించినా సమస్య పరిష్కారం కావడం లేదు.

-శ్రీరాములు, జన్వాడ గ్రామం



ధరణి సెంటర్ వద్ద ఫిర్యాదుదారుల క్యూ

నెలలుగా పెండింగ్‌లో మ్యుటేషన్



సర్వే నంబర్ 671లో గుంట భూమిని కొనుగోలు చేశాం. రిజిస్ట్రేషన్ చేసుకుని మ్యుటేషన్‌కు పెట్టుకున్నాను. మార్చిలో మ్యుటేషన్‌కు పెట్టుకుంటే ఇప్పటి వరకు కాలేదు. తహసీల్దారు పట్టించుకోవడం లేదని కలెక్టరేట్‌లోని ప్రజావాణికి వస్తే.. ఇక్కడ విజ్ఞప్తులు తీసుకోవడం వరకే సరిపోతుంది. పరిష్కారం అయ్యే సూచనలు కనిపించడం లేవు.

-కె. జ్ఞానేశ్వర్, జన్వాడ, శంకర్‌పల్లి మండలం

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

బషీరాబాద్, ఆగస్టు 12: ఉపాధ్యాయుల పరిష్కారానికి పీఆర్టీయూ నిర్విరామంగా కృషి చేస్తుందని జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి అన్నారు. పీఆర్టీయూ బషీరాబాద్ మండలశాఖ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ టీచర్ల సమస్యల్లో ఒకటైనా 317జీవో బాధితులకు తగు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. వారికి హెల్త్ కార్డులు మంజూర య్యేలా చూస్తామన్నారు. పీఆర్టీయూ బషీరాబాద్ మండలశాఖ అధ్యక్షుడు నర్సింహారెడ్డి మట్లాడుతూ ప్రభుత్వం నుంచి రావాల్సిన నాలుగు డీఏలు, పీఆర్సీ వెంటనే ప్రకటించేలా రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వంపై వత్తిడి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ అధ్యక్షులు, గౌరవ అధ్యక్షుడు కె.నర్సింహారెడ్డి, రవికాంత్, సంతోష్, ఈశ్వర్‌గౌడ్, నాగరాజ్, సాజిదాబేగం, శ్రీధర్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రవికుమార్, మౌలానా పాల్గొన్నారు.



బషీరాబాద్ సీపీఎస్‌లో సభ్యత్వం చేయిస్తున్న వెంకట్‌రాంరెడ్డి, తదితరులు

అయ్యో బిడ్డా.. ఎంతపని జరిగింది

- అశ్రునయానాల మధ్య తండ్రి, ఇద్దరు కూతుళ్ల అంత్యక్రియలు
- ఒకే సమాధిలో.. ముగ్గురి మృతదేహాలు

మనోహరాబాద్, ఆగస్టు 12: 'అయ్యో బిడ్డా ఎంత పని జరిగింది. ఒక్క ప్రమాదంలోనే కుటుంబం ఆగమైంది కదా.. తండ్రి ఇద్దరు బిడ్డలకు ఒకే రోజు రాసిపెట్టాడా' ఆ దేవుడు అంటూ అక్కడున్న వారంతా కన్నీరు మున్నీరయ్యారు. విధి నిర్వహణలో ఉన్న ట్రాక్‌మెన్ కృష్ణ(42), అతని ఇద్దరు కూతుళ్ల వర్షిత (12), వరణి(7)లు ఆదివారం మేడ్చల్ జిల్లా గౌడవెల్లి రైల్వేస్టేషన్ వద్ద రైలు ఢీ కొని చనిపోయిన విషయం తెలిసిందే. వారి మృతదేహాలను సోమవారం స్వగ్రామమైన మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపేటకు తీసుకురాగా గ్రామస్థుల అశ్రునయనాల మధ్య జరిగాయి. గ్రామానికి చెందిన నారాయణ, నాగమణిల చిన్నకుమారుడైన కృష్ణకు రైల్వేలో పని చేసిన తండ్రి ఉద్యోగ విరమణ చేయడంతో రైల్వేలో ఉద్యోగం వచ్చింది. ఉద్యోగ నిమిత్తం కృష్ణ పదేళ్లుగా మేడ్చల్ లో ఉంటున్నాడు. ఆదివారం ఈ ఘోరం జరగగా, సోమవారం గ్రామస్థుల అశ్రునయనాల మధ్య తండ్రీ కూతుళ్ల అంత్యక్రియలు జరిగాయి. ఒకే బొంద తీసి తండ్రి, ఇద్దరు కూతుళ్లను ఖననం చేశారు. అయితే, తండ్రి, ఇద్దరు కూతుళ్ల ఒకే ప్రమాదంలో జరగడంతో తల్లి నాగమణి కుమారుడు, మనమరాళ్ల మృతదేహాల వద్ద పడి రోదించడం అక్కడి వారిని కదలించింది. బాధిత కుటుంబాన్ని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పరామర్శించారు.



కుమారుడు, మనుమరాళ్ల మృతదేహాల వద్ద రోదిస్తున్న కృష్ణ తల్లి నాగమణి

ఓటరు నమోదుకు మరో అవకాశం



మేడ్చల్ ఆగస్టు12(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలో కొత్త ఓటర్ల నమోదుకు మళ్లీ అవకాశం వచ్చింది. చిరునామా మార్పులు, సవరణలు, మృతుల పేర్లు తొలగించడానికి ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండే వారు కొత్తగా ఓటర్లుగా నమోదు చేయించుకోవడానికి అర్హులని అధికారులు పేర్కొంటున్నారు. ఈ నెల 20వ తేదీ నుండి బూత్‌స్థాయి అధికారులు ఇంటింటా తిరిగి వివరాలు సేకరించనున్నారు. అర్హత కలిగిన వారిని కొత్త ఓటర్లుగా నమోదు చేయించడంతో పాటు మృతుల వివరాలను తీసుకొని వారి పేర్లను జాబితా నుంచి తొలగించనున్నారు. అవసరమైన వారి చిరునామా మార్చనున్నారు. ఓటరు జాబితాలో ఫొటో లేకుంటే వాటిని సేకరిస్తారు. ఫొటో సరిగ్గి లేకుంటే మరొకటి తీసుకుని జాబితాలో చేరుస్తారు. యువతీ యువకులు బూత్ కేంద్రాలకు వెళ్లి దరఖాస్తులను పూరించి ఇస్తే ఓటరుగా నమోదు చేస్తారని, అదేవిధంగా ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవడానికి వీలుందని అధికారులు చెబుతున్నారు.

దశాబ్ద కాలపు ఎదురు చూపులకు మోక్షం

లక్నాపూర్ ప్రాజెక్టు కాల్వల మరమ్మతులు



లక్నాపూర్ ప్రాజెక్టు కాల్వలో తొలగించిన పూడిక

ధారూరు, ఆగస్టు 12: దశాబ్ద కాలంగా ఎదురు చూస్తున్న రైతుల ఆశలు ఎట్టకేలకు ఫలించాయి. లక్నాపూర్ ప్రాజెక్టు కింద కాల్వలను సాగునీటి శాఖ అధికారులు మరమ్మత్తులు చేయించ కుండా వదిలేయటంతో కాలువలు అనవాళ్లు లేకుండా పోయాయి. దీంతో ప్రాజెక్టు కింద ఉన్న మండల పరిధిలోని అంతారం, నాగారం, మోమిన్‌కలాన్, మోమిన్‌కుర్దు, రాజాపూర్ గ్రామాల రైతుల ఆయకట్టుకు సాగునీరు అందలేదు. దీంతో ఆయా గ్రామాల రైతులు ఈ సమస్యను గత నెలలో శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్ దృష్టికి తీసికెళ్లారు. దీంతో స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఇరిగేషన్ ఈఎన్‌సీ అనిల్‌కుమార్, చేవెళ్ల సర్కిల్ ఎస్‌ఈ రంగారెడ్డిలతో చర్చించి లక్నాపూర్ ప్రాజెక్టు కాల్వలను మరమ్మత్తులకు రూ. 18.44 లక్షలు మంజూరు చేయించటంతో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం ప్రాజెక్టు కుడికాల్వలో మట్టితీత, చెట్లు, పొదల నరికివేత పనులు కొనసాగుతున్నాయి. కాల్వల మరమ్మత్తుల పనులతో తమ ఆయకట్టుకు సాగు నీరందుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

శరవేగంగా పట్టణాల అభివృద్ధి



తొండుపల్లిలో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్


శంషాబాద్ రూరల్, ఆగస్టు 11 : పట్టణాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. గొల్లపల్లి, కిషన్‌గూడ్, తొండుపల్లి వార్డుల్లో కౌన్సిలర్లు లావణ్యశ్రీనివాస్‌గౌడ్, అశోక్‌తోలి కలిసి సీసీ రోడ్డు పనులకు సోమవారం శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి పట్టణాల అభివృద్ధికి శ్రద్ధ తీసుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అత్యధిక నిధులను పట్టణ ప్రాంతాలకు కేటాయించిందన్నారు. శంషాబాద్ పరిధి అన్ని వార్డులకు నిధులు కేటాయిస్తామన్నారు. ఇప్పటికే పట్టణంలో 90శాతం సీసీ రోడ్లు పూర్తిచేశామన్నారు. మిగిలినవీ పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుష్మారెడ్డి, వైస్‌చైర్మన్ బండి గోపాల్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేష్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్, దర్శన్, శంకర్, రాచమల్ల సురేష్, మహేష్, విశ్వనాథం, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.



పల్లె దారులు పచ్చందాలను సంతరించుకున్నాయి. హరితహారంలో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో ఆరేళ్ల క్రితం నాటిన మొక్కలు ఏపుగా పెరిగి చెట్లుగా దర్శనమిస్తున్నాయి. ఈ దారిలో ఇరువైపులా చెట్లు పచ్చందాలతో కనువిందు చేస్తూ రాకపోకలు సాగించే వాహనదారులకు పచ్చని తోరణం కట్టినట్లుగా స్వాగతం పలుకుతూ ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. బషీరాబాద్-తాండూరు ప్రధాన రోడ్డులో గొట్టిగఖుర్దు సమీపంలోని చెట్లు పచ్చదనంతో ఇలా అందిరినీ ఆకట్టుకుంటున్నాయి. మొక్కలు నాటడం వల్ల కలిగే ప్రయోజనాలకు ఈ చెట్లు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. *- బషీరాబాద్, ఆగస్టు 12*

విరామం లేకుండా విధుల్లోనే

- రిలీవర్ వచ్చే వరకూ రోజుల తరబడి డ్యూటీ!
- కొండారెడ్డిపల్లి సబ్‌స్టేషన్‌లో వింత పరిస్థితి
- సిబ్బంది లేక ఇబ్బందులు పడుతున్న ట్రాన్స్‌కో ఉద్యోగులు
- ఇక్కడ డ్యూటీకి జంకుతున్న సిబ్బంది



పోమాల్‌పల్లి-కొండారెడ్డిపల్లి సబ్‌స్టేషన్, విధులు నిర్వహిస్తున్న జేఎల్ఎం

కేశంపేట, ఆగస్టు 12: సాధారణంగా ఓ ఉద్యోగి 8గంటలు పనిచేస్తాడు. అదనపు సమయం చేయాల్సి వస్తే మరో నాలుగు గంటలు పనిచేస్తాడు. అయితే కేశంపేట మండలం పోమాల్‌పల్లి-కొండారెడ్డిపల్లి సబ్‌స్టేషన్‌లో డ్యూటీ పడితే రిలీవర్ వచ్చేంత వరకు ఉద్యోగి అక్కడే పనిచేయాల్సిందే! పోమాల్‌పల్లి-కొండారెడ్డిపల్లి 33/11కేవీఏ సబ్‌స్టేషన్‌ను అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రారంభించింది. సబ్‌స్టేషన్‌లో సిబ్బంది లేక ప్రారంభించిన కొద్ది రోజులకే సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా బందైంది. ఈ విషయమై అప్పట్లో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు కేశంపేట ఏఈ పరిధి సిబ్బందికి డ్యూటీవేసి సబ్‌స్టేషన్ నడిపించేలా చర్యలు తీసుకున్నారు. ఏఈ ఈశ్వర్ తన పరిధిలో ఉన్న లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్లు, జేఎల్ఎంలు, ఆర్టిజెన్‌లతో రోజుకు ఒకరు చొప్పున విధులు నిర్వహిస్తున్నారు. వారికి ప్రతీ నెల 1న డ్యూటీచార్ట్ వేస్తున్నారు. అయితే రెండు నెలలుగా డ్యూటీచార్ట్ అమలు కావడం లేదు. 13మంది జూనియర్ లైన్‌మెన్ సబ్‌స్టేషన్‌ను నడిపిస్తున్నారు. ఇక్కడ విధులు నిర్వహించాలంటూ జేఎల్ఎంలు జంకుతున్నారు. ఒకసారి డ్యూటీకి వెళ్తే.. మళ్లా రిలీవర్ వచ్చేంత వరకు డ్యూటీ చేయాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోజులుగా రాజశేఖర్ అనే జేఎల్ఎం ఇక్కడ డ్యూటీ చేస్తున్నాడు. అతడికి రిలీవర్ రాక సోమవారం కూడా పనిచేశాడు. నాలుగు రోజులుగా అక్కడే ఉంటూ పక్క ఊరి నుంచి తిను బండారాలను తెప్పించుకొని తింటున్నాని చెప్పాడు. ఇంటికి పోయివచ్చే టైం కూడా లేదని, సబ్‌స్టేషన్‌లో డ్యూటీ అంటే రాత్రీ పగలు పర్యవేక్షణ ఉండాల్సిందే అని జేఎల్ఎం తెలిపాడు. ఏకధాటిగా నాలుగు రోజులు పనిచేస్తే పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేశాడు. సబ్‌స్టేషన్‌కు సిబ్బందిని నియమించకుండగానే ప్రారంభించడంతో ఈ సమస్య ఎదురైనట్టు ఆర్టిజన్లు, జేఎల్ఎంలు అంటున్నారు. రెండు, మూడు రోజులు పనిచేయాలంటే ఇబ్బంది పడుతున్నామని వారు తెలిపారు.

రోజుకొకరితో సబ్‌స్టేషన్‌ను నడుపుతున్నాం

పోమాల్‌పల్లి-కొండారెడ్డిపల్లి సబ్‌స్టేషన్‌కు సిబ్బంది లేక మండల పరిధిలో పనిచేస్తున్న విద్యుత్ సిబ్బందిలో రోజుకు ఒక్కరికి ఇక్కడ డ్యూటీ వేస్తున్నాం. 30 మందితో సబ్‌స్టేషన్ రన్‌చేస్తున్నాం. సిబ్బంది లేక ఇబ్బందులు ఎదురవుతున్నా విద్యుత్ సరఫరా చేస్తున్నాం. సిబ్బంది సహకారంతో వినియోగదారులకు సేవలందిస్తున్నాం. ఒక్కోసారి ఉద్యోగికి రెండు మూడూ రోజుల కంటిన్యూ డ్యూటీపడి ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ ప్రభుత్వం పూర్తిస్థాయి సిబ్బందిని నియమిస్తే ఇబ్బదులు తీరుతాయి. **- ఈశ్వర్, ట్రాన్స్‌కో ఏఈ, కేశంపేట**

విశ్వకర్మల గొప్పతనాన్ని చాటాలి

పీఠాధిపతి సామర్ల వెంకటేశ్వరరావు



సామర్ల వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న విశ్వబ్రాహ్మణులు

షాద్‌నగర్‌అర్బన్, ఆగస్టు 12: విశ్వకర్మ జాతి గొప్పదని, తమ జాతి గొప్పతనాన్ని సమాజానికి చాటాలని హైదరాబాద్ ధర్మ సంవర్ధిని కాలజ్ఞాన పీఠాధిపతి సామర్ల వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. విశ్వకర్మ ఫౌండేషన్, విశ్వబ్రాహ్మణ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పతంజలి యోగా కేంద్రంలో విశ్వబ్రాహణ ఆత్మీయ సమ్మేళనం, వివాహ పరిచయ వేదిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పేద విశ్వకర్మలు సైతం ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేలా ప్రోత్సహించాలని కోరారు. పవిత్రమైన వివాహ ఆచార వ్యవహారాలను కాపాడడానికి వేదికలను నిర్వహించడం అభినందనీయమన్నారు. విశ్వకర్మ ఫౌండేషన్ అధ్యక్షుడు రవీంద్రచారి మాట్లాడుతూ తమ ఫౌండేషన్ సహకారంతో రెండు వేల పెళ్లిళ్లు చేశామని తెలిపారు. కార్యక్రమంలో కమ్మదనం సుధాకర్, షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, సంఘం సభ్యులు దుప్పల్లి రాములు, డిస్కో శ్రీను, కొందూటి రవి, బాలబ్రహ్మాచారి, మాధవచారి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ, పట్టుదలతో చదవాలి

అనురాగ్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ అర్చన



మాట్లాడుతున్న వీసీ అర్చన

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 12 : విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదవాలని, అప్పుడే వారు జీవితంలో రాణిస్తారని అనురాగ్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ అర్చన అన్నారు. మంగళవారం వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో బీబీఏ విద్యార్థులకు ఓరియేంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకోని చదవాలన్నారు. విద్యార్థులు వారి లక్ష్యాలను సాధించాలంటే క్రమశిక్షణ, పట్టుదల ఎంతో ముఖ్యమన్నారు. క్రమం తప్పకుండా క్లాస్‌లకు రావాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా యూనివర్సిటీలో మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. అధ్యాపకులు కూడా విద్యార్థులకు అర్థమయ్యేలా విద్యాబోధన చేయాలని సూచించారు. విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకోని చదవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ బాలాజీ ఉట్ల, అడ్మిషన్స్ డీన్ మహిపతి శ్రీనివాస్‌రావు, హెచ్‌వోడీ విష్ణుచందన, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మంత్రి పొన్నంకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే శంకర్

దుకాణాల అద్దె చెల్లింపు గడువు పెంచాలి

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 12 : షాద్‌నగర్ బస్టాండ్‌లో షాపింగ్ కాంప్లెక్స్‌ల అద్దె గడువును పెంచాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఎమ్మెల్యే సోమవారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి విన్నవించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ రెంటల్ అగ్రిమెంట్ ముగియడంతో వ్యాపారులు ఎమ్మెల్యేకు సమస్యను వివరించారు. కరోనా వల్ల రెండేళ్లు వ్యాపారాలే నడవక నష్టపోయామని, మరో రెండేళ్లు తమ ఒప్పందాన్ని పొడగించాలని కోరారు. వ్యాపారుల కోరిక మేరకు కాస్త అద్దెను పెంచైనా సరే గడువివ్వాలని మంత్రిని కోరగా.. పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని ఆర్టీసీ ఎంపీడీ మంత్రి లెటర్ రాశారని ఎమ్మెల్యే తెలిపారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సహించం

ఇకపై నిరంతర తనిఖీలు : ఏసీపీ శ్రీనివాస్‌రావు

వంద మంది పోలీసులతో పాన్‌షాపులు, కిరాణా దుకాణాల్లో తనిఖీలు



పాన్‌షాప్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

శంషాబాద్ రూరల్, ఆగస్టు 12 : ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకపాలకు పాల్పడితే వారి తాటతీస్తామని, అలాంటి వారెవరినీ సహించం అని శంషాబాద్ ఏసీపీ కె.శ్రీనివాస్‌రావు హెచ్చరించారు. ఏసీపీ అధ్వర్యంలో నలుగురు సీఐలు, 80మంది కానిస్టేబుళ్లు శంషాబాద్‌లో పాన్ షాప్‌లు, లాడ్జీలు, కిరాణ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఇటీవల గంజాయి, ఇతర మత్తు పదార్థాల ఆనవాళ్లు లభ్యమైన నేపథ్యంలో ఈ ప్రాంతంలో పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. అలాగే కార్డెన్‌సెర్చ్ నిర్వహించి సర్టిఫికెట్లు లేని ఐదు బైక్‌లు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేశారు. అనంతరం ఏసీపీ విలేకరులతో ఏసీపీ మాట్లాడుతూ.. కమిషనర్ ఆదేశాల మేరకు తనిఖీలే చేశామన్నారు. డ్రగ్స్ మత్తు పదార్థాలు అమ్ముతున్నారన్న సమాచారంతో తనిఖీలు చేపట్టామన్నారు. తనిఖీలు ఇకపై నిరంతరంగా కొనసాగుతాయని తెలిపారు. డ్రగ్స్ అమ్మినా, కొన్నా నేరమేనని అన్నారు. డ్రగ్స్ గురించి ఏ చిన్న విషయం తెలిసినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. తనిఖీల్లో ఓ పాత నేరస్తుడ్ని అరెస్టు చేశామని చెప్పారు. అతడిపై 8కేసులు ఉన్నాయని, అందుకే అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో జోన్ సీఐలు బాల్‌రాజు, నరేందర్‌రెడ్డి, ప్రసాద్, ఎస్సైలు, హెచ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.




వికారాబాద్‌లో హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ

హిందువులపై దాడులను అరికట్టాలి

హిందూ ఐక్య వేదిక ● వికారాబాద్‌లో బంద్ విజయవంతం

వికారాబాద్, ఆగస్టు 12 : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని వికారాబాద్‌లోని హిందూ ఐక్యవేదిక పిలుపు మేరకు సోమవారం వికారాబాద్ పట్టణంలో చేపట్టిన బంద్ విజయవంతమైంది. పట్టణంలో వాణిజ్య, వ్యాపార, విద్యా సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. ఈ సందర్భంగా ఐక్యవేదిక నాయకులు రామ మందిరం చేసుకుని బంగ్లాదేశ్‌లో జరిగిన దమనకాండకు అశువులు బాసిన హిందువులకు రెండు నిమిషాలు మౌనం పాటించి, అక్కడ ఉన్నహిందువులకు మనోధైర్యం నింపాలని హనుమాన్ చాలీసా పారాయణం చేసి అనంతరం అక్కడి నుండి కదిలిందిరా కాషాయం... హిందువులపైన అరాచకాలు ఆపాలి, సేవ్ బంగ్లా హిందూస్ అని నినాదాలు చేస్తూ శాంతి యుతంగా కాషాయం జెండాలతో బీజేఆర్ చౌరస్తా వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బంగ్లాదేశ్‌లో అరాచకాలకు పాల్పడిన వారి దిష్టిబొమ్మను దహనం చేశారు. సీఐ నాగరాజు ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా నాయకులు, కులసంఘాల నాయకులు, వ్యాపార, విద్యావేత్తలు తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో కొవ్వొత్తులతో నిరసన



కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్ టౌన్, ఆగస్టు 12: బంగ్లాదేశ్‌లో హిందువులపై, హిందూ ఆలయాలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ సోమవారం సాయంత్రం మేడ్చల్ పట్టణంలో బీజేపీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. వివేకానంద విగ్రహం వద్దకు చేరుకుని కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి, పట్టణ బీజేపీ అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు సుధాకర్‌రెడ్డి, ప్రభుకర్‌రెడ్డి, జాకట ప్రేమ్‌దాస్, శ్రీనివాస్‌గౌడ్, వంశీవిజయ్, మైసరి రాజు పాల్గొన్నారు.

అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్





నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ కోటిరెడ్డి, స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి ఆభరణాలు

- చోరీ కేసును చేధించిన పోలీసులు
- 300 సీసీ కెమెరాల పరివేక్షణతో విచారణ

మూడుచింతలపల్లి, ఆగస్టు 12 : ఈనెల 6వ తేదీ రాత్రి తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ కృష్ణ నగల షాపులో జరిగిన చోరీ కేసును పోలీసులు చేధించారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని సోమవారం శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో డీసీపీ కోటిరెడ్డి విలేకరుల సమావేశం వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ రాజస్థాన్‌కు చెందిన శంకర్ సింగ్ (23), శంకర్‌సింగ్ (25), మేడ్చల్ జిల్లా కొంపల్లిలో కారు, ఆటో డ్రైవర్లు పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈక్రమంలో ఇద్దరు ఎక్కువగా డబ్బు సంపాదించాలనే ఆశతో పాటు, లగ్జరీ జీవనం గడపాలని, రాజస్థాన్‌కు చెందిన హనుమంత్‌సింగ్, జలాంసింగ్‌ను పిలిపించి చోరీకి పథకం పన్నారు. ఏదైనా నగల షాపులో బంగారాన్ని పెద్దఎత్తున దొంగతనం చేద్దామని ప్లాన్ చేశారు. ఈ క్రమంలో ఈనెల 4న గజ్వేల్‌లోని మార్కెట్ వద్ద పల్సర్ బైక్‌ను దొంగలించారు తరువాత అల్వాల్‌లోని సూర్య నగర్‌లో ఇల్లును అద్దెకు తీసుకుని ఉన్నారు. 5వ తేదీన పథకం ప్రకారం తూంకుంటకు వచ్చి రెక్కీ నిర్వహించారు. శ్రీ కృష్ణ జ్యూవెల్లరీ షాపులో చోరీ చేసేందుకు నిర్ణయించుకున్నారు. 6వ తేదీ రాత్రి గడ్డపార సాయంతో షెటర్‌ను తొలగించి, బంగారం, వెండి, నగదు అపహరించుకుని అల్వాల్‌కు వెళ్లి పోయారు. విషయం తెలుసుకున్న డీసీపీ కోటిరెడ్డి సంఘటనా స్థలానికి చెరుకుని పరిశీలించారు. శ్రీ కృష్ణ జ్యూవెల్లరీ షాపు యజమాని గణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. డీసీపీ కోటిరెడ్డి అధ్వర్యంలో 5 బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. దాదాపు 300 సీసీ కెమరాల పరివేక్షణలో ముమ్మరంగా విచారణ చేపట్టారు. 11వ తేదీ ఆదివారం అల్వాల్‌లో నివాసం ఉంటున్న ఇద్దరు నిందితులు శంకర్‌సింగ్, జలామ్‌సింగ్‌లను పట్టుకుని విచారించగా నేరాన్ని అంగీకరించారు. వారి వద్ద నుంచి 11.5 తులాల బంగారు ఆభరణాలు, 46 కిలోల వెండితో పాటు 2 సెల్‌ఫోన్లు, పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు త్వరలోనే వారిని పట్టుకుంటామని డీసీపీ తెలిపారు. ఈ కేసును చేధించిన ఏసీపీలు రాములు, కలింగరాజు, సీఐ శ్రీనాథ్, డీఐ నర్సింహరాజు, డీఐ రాజేందర్, ఇన్‌స్పెక్టర్లు నర్సింహ, రాజు, గంగాధర్, మునీందర్, వెంకట్, రాజు, సిబ్బందిని డీసీపీలు కోటిరెడ్డి, నర్సింహులు అభినందించారు.

జల్సాలకు అలవాటు పడి..

చిన్న వయస్సులోనే చెడు అలవాట్లకు బానిసలై జల్సాలు, విలాసవంతమైన జీవితం గడపాలనే ఉద్దేశంతో కష్టపడకుండా ఈజీ మని సాంపాదించాలని చోరీలకు పాల్పడుతున్నారు. చివరికి పోలీసులకు చిక్కి కటకటాల పాలై ఊసలు లెక్కపెడుతున్నారు. వారి బంగారు భవిష్యత్తును అంధకారంలోకి నెట్టుకుంటున్నారు. కాగా, ప్రజలు తమ ఇంటి వద్ద చుట్టు పక్కల సీసీ కెమెరాలను అమర్చుకుని, పోలీసులకు సహకరించాలని డీసీపీ సూచించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


నగదు ఇస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్ ఆగస్టు 12 : ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్దలో నిర్మిస్తున్న ఆంజనేయ స్వామి ఆలయానికి మాజీ ఎంపీపీ చల్లా వెంకటేశ్వర్ రెడ్డి రూ.51వేల విరాళం ఇచ్చారు. లింగారెడ్డిగూడలోని ఆయన స్వగృహంలో సోమవారం ఆలయ కమిటీ సభ్యులు అన్మారి వెంకటయ్య, కక్కునూరి వెంకటేష్ గుప్తలకు నగదు అందించారు.

దైవ కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలి

తలకొండపల్లి, ఆగస్టు 12: దైవ కార్యక్రమాల్లో ప్రతీ ఒక్కరు పాలుపంచుకోవాలని బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. ఆధ్యాత్మిక, దైవకార్యక్రమాలు మానవాళి సన్మార్గ పురోగమనానికి, సమాజ శాంతికి దోహదపడతాయని పేర్కొన్నారు. గట్టిప్పలపల్లిలో నూతనంగానిర్మించే పోచమ్మ తల్లి దేవాలయానికి సోమవారం చంద్రశేఖర్‌రెడ్డి విరాళం అందజేశారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత


బోరు మోటార్‌ను ప్రారంభిస్తున్న నవీన్‌కుమార్‌రెడ్డి

షాద్‌నగర్ రూరల్, ఆగస్టు 12 : ఆధ్యాత్మికతతోనే మనిషికి మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం రాసుమల్లగూడ హనుమాన్ ఆలయం వద్ద సోమవారం బోరు మోటార్‌ను ఏర్పాటు చేయించారు. ఆయన మాట్లాడుతూ సన్మార్గంలో నడవాలంటే ప్రతీ మనిషికి భక్తిమార్గం అవసరమని అన్నారు. దీనికి మతంతో సంబంధం లేదన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాధవిరంగయ్య, నాయకులు లక్ష్మణ్‌నాయక్, రామకృష్ణ, నాగభూషన్ తదితరులు ఉన్నారు.

సన్మార్గంతోనే దైవానుగ్రహం

ఆమనగల్లు: సన్మార్గంతోనే మనిషికి దైవానుగ్రహం ప్రాప్తిస్తుందని కల్వకుర్తి నియోజకవర్గ గౌడ సంఘం ఉపాధ్యక్షుడు, ఆమనగల్లు కాటమయ్య ఆలయ ప్రధాన కార్యదర్శి గంగ రవిగౌడ్ అన్నారు. ఆధ్యాత్మిక చింతనతో ముందుకు సాగేవారు ఆనందమయ జీవనం గడుపుతారని తెలిపారు. ఆమనగల్లులో కట్టమైసమ్మ ఆలయంలో ఈ నెల 21 నుంచి 23 వరకు నిర్వహించే విగ్రహ ప్రతిష్ఠాపన పూజలకు రావాలని ఆలయ అధ్యక్షుడు, ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు మొక్తాల వెంకటయ్య గంగ రవికి ఆహ్వానాన్ని అందజేశారు. ఆలయ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని చెప్పారు. విగ్రహ ప్రతిష్ఠ వేడుకలకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు వెంకటయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిన్న వెంకటయ్య, ఎర్రవోలు శ్రీను, యాదయ్య, అంజయ్య, సాయి, రాజు తదితరులు ఉన్నారు.


రవీందర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న వెంకటయ్య

క్రైం కార్నర్

డివైడర్‌ను ఢీకొట్టిన బైక్.. వ్యక్తి మృతి

● మరొకరికి తీవ్ర గాయాలు


మృతి చెందిన కురుమూర్తి

శంషాబాద్ రూరల్, ఆగస్టు 12: బైక్ డివైడర్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ బాల్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని వీకర్ సెక్షన్ కాలనీ, ఇజత్ నగర్‌కు చెందిన కురుమూర్తి(48), మరో వ్యక్తి కలిసి బైక్‌పై నగరం వైపు నుంచి సర్వీస్ రోడ్డులో శంషాబాద్‌కు వస్తుండగా చెన్నమ్మ హోటల్ వద్ద బైక్ కరెంట్ స్తంభాన్ని ఢీకొంది. బైక్ నడుపుతున్న కురుమూర్తి అక్కడికక్కడే మృతిచెందగా వెనక కూర్చున్న వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టంకు, క్షతగాత్రుడిని చికిత్స కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఇద్దరూ శంషాబాద్‌లో పెయింట్ పని చేసే వాళ్లని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

స్కూల్ బస్సు ఢీకొని వ్యక్తి దుర్మరణం


కైలేశ్ మృతదేహం

శంషాబాద్ రూరల్, ఆగస్టు 12: స్కూల్ బస్సు ఢీకొని మైలార్‌దేవ్‌పల్లి దుర్గానగర్‌కు చెందిన కైలేశ్(43) అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ బాల్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం... సాతంరాయిలో హైదరాబాద్-బెంగళూర్ హైవేపై ఉదయం 5.45గంటలకు హైదరాబాద్ నుంచి శంషాబాద్ వైపు వస్తున్న ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు రోడ్డు దాటుతున్న కైలేశ్‌ను ఢీకొంది. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కట్నం కోసం వేధించి వివాహిత మృతికి కారకులైన

ముగ్గురికి యావజ్జీవ జైలు

తలకొండపల్లి, ఆగస్టు 12: వరకట్నం కోసం వేధించడంతో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఇందుకు కారకులైన ముగ్గురికి జిల్లా సెషన్స్ కోర్టు సోమవారం జీవిత ఖైదు విధించిందని తలకొండపల్లి ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పూల్‌సింగ్ తండాకు చెందిన పత్లావత్ సురేందర్‌కు సునీతతో వివాహమైంది. వివాహ సమయంలో సునీత తల్లిదండ్రులు కట్నంగా రూ.5లక్షలు, రెండు తులాల బంగారు ఆభరణాలిచ్చారు. సునీత దంపతులకు కుమారుడు, కూతురు ఉన్నారు. పెళ్లయిన రెండేళ్ల నుంచి సునీతను భర్త సురేందర్, అత్త పీక్లి, ఆడపడుచు సంతోష అదనపు కట్నం తేవాలని శారీరకంగా, మానసికంగా వేధించారు. వారి వేధింపులు తాళలేక సునీత 2021 జనవరి 10న ఫ్యాన్‌కు ఉరేసుకుంది. ఆమె సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. దర్యాప్తు నివేదికను తర్వాత అప్పట్లో ఏవీగా ఉన్న షాద్‌నగర్ ఏసీపీ కుషాల్కర్ ఎల్‌బీనగర్‌లోని జిల్లా కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన సెషన్స్ కోర్టు న్యాయాధికారి మూర్తి హరీష.. నిందితులకు యావజ్జీవ జైలు శిక్ష, రూ.50 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని ఎస్ఐ వివరించారు.

రెండు ఆవుల మృతి.. రైతుకు తీరని నష్టం


ఆవుల కళేబరాల వద్ద రోదిస్తున్న రైతు దంపతులు

షాద్‌నగర్ రూరల్ ఆగస్టు 12 : అనారోగ్యంతో ఒకటి, తలుగు ఉరి పడి ఒకటి ఇలా ఒకే రోజు రెండు పాడి ఆవులు మృత్యువాత పడడంతో పాడిరైతు జీవనాధారం కోల్పోయాడు. వివరాల్లోకి వెళ్తే.. ఫరూఖ్‌నగర్ మండలం విఠ్యాలలో లింగమయ్య రెండు నెలల కింద రూ.3.5లక్షలు పెట్టి మూడు ఆవులను కొన్నాడు. భార్యాభర్తలు పాలు అమ్ముతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. రెండు రోజుల కింద ఒక ఆవు అనారోగ్యానికి గురైంది. చికిత్స చేసినా బతకలేదు. అనారోగ్యానికి గురైన ఆవుకు దూరంగా కట్టేసిన మరో ఆవు ఉరిపడి చనిపోయింది.రెండు ఆవులు చనిపోవడంతో రైతులు కన్నీరుమున్నీరయ్యారు. ఆవుకు వచ్చిన రోగం గురించి కిషన్‌నగర్ పశువైద్యాధికారి ముక్కటి రాజును సంప్రదించగా ఆవు థైలేరియా వ్యాధితో చనిపోయిందని చెప్పాడన్నారు. వేరే ప్రాంతాల నుంచి తెచ్చుకున్న ఆవులకు ఇక్కడి వాతావరణం పడక థైలేరియా వ్యాధి వస్తుందని వైద్యుడు చెప్పారని రైతు తెలిపాడు. కాగా బాధిత రైతు లింగమయ్యకు కాంగ్రెస్ నాయకుడు జగన్ పది వేల సాయం చేశారు.


ఆటో-ఆర్టీసీ బస్సు ఢీ.. భార్యాభర్తకు గాయాలు

కొత్తూర్, ఆగస్టు 12: కొత్తూర్ మండలంలోని తిమ్మాపూర్ చౌరస్తా వద్ద సోమవారం ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలయ్యాయని ఎస్ఐ జి.శ్రీనివాస్ తెలిపారు. నాగర్‌కర్నూల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న బస్సు, కొత్తూర్‌లోకి వచ్చేందుకు చౌరస్తా దాటుతుండగా, ఆటోను ఢీకొంది. దీంతో బోల్తా పడిందన్నారు. ఆటోలో ఉన్న హైదరాబాద్‌లోని మొఘలపుర ప్రాంతానికి చెందిన ఒమర్ బిన్‌ముబారక్(45), అతడి భార్య తస్లీంలకు గాయాలైనట్లు పేర్కొన్నారు. వారు చికిత్స కోసం ఆసుపత్రికి వెళ్లారని తెలిపారు. ముబారక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి. శ్రీనివాస్ తెలిపారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురి రిమాండ్


మాడ్గుల, ఆగస్టు 12: అర్కపల్లిలో ఇటీవల పందుల లింగం అనే వ్యక్తిపై హత్యాయత్నం చేసిన కేసులో ముగ్గురిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇబ్రహీంపట్నం అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ కేవీపీ. రాజు తెలిపారు. అరెస్టైన నిందితుల్లో ఆర్కపల్లికి చెందిన యాచారపు జగతయ్య, బిక్కయ్య, సుద్దపల్లికి చెందిన పందుల బాల్రాజు ఉన్నారన్నారు.

కుక్కల దాడిలో 11 మేకల మృత్యువాత


మేకల కళేబరాలు

తలకొండపల్లి, ఆగస్టు 12 : బిజినపల్లిలో సోమవారం తెల్లవారుజామున వెంకటయ్యకు చెందిన పశువుల కొట్టంలోకి కుక్కలు పోయి మేకలను చంపాయి. వెంకటయ్య పొలం వద్ద దొడ్డిలో మేకలను ఉంచి ఇంటికొచ్చాడు. రాత్రి 9 గంటలకు కొట్టం వద్దకు వెళ్లి చూడగా 11 మేకలను కుక్కలు చంపేయడాన్ని గుర్తించాడు. చనిపోయిన మేకల విలువ లక్ష వరకు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని వెంకటయ్య కోరాడు. గ్రామంలో కుక్కల బెడదను నివారించాలని చాలారోజులుగా కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామ రైతులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హాస్టల్ నుంచి పోయిన బాలలు వార్డెన్‌కు అప్పగింత


హాస్టల్‌కు చేరుకున్న విద్యార్థులు

మాడ్గుల, అగస్టు 12: కొత్త బ్రాహ్మణపల్లిలోని సెయింట్ గైతాన్స్ స్కూల్‌కు చెందిన హాస్టల్ విద్యార్థులు ఆకాష్, రాజవీర్ హాస్టల్ గోడదూకి బయటకు పోయారు. దీంతో స్కూల్ సిబ్బంది విద్యార్థుల ఫొటోలను వాట్సాప్ గ్రూపుల్లో పెట్టారు. చివరకు పోలీసులు విద్యార్థులను గుర్తించి హాస్టల్‌కు చేర్చారు. వివరాల్లోకి వెళ్తే.. శనివారం, ఆదివారం సెలవులు కావడంతో తమను చూసేందుకు తల్లిదండ్రులు రాలేదని విద్యార్థులు హాస్టల్ నుంచి వెళ్లిపోయారు. దీంతో హాస్టల్ నిర్వాహకులు విద్యార్థుల ఫొటోలు వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేశారు. విద్యార్థులు ఆకుతోటపల్లి గేటు సమీపంలో ఉన్నారని సమాచారం అందడంతో హెడ్‌కానిస్టేబుల్ రోశనప్ప, కానిస్టేబుల్ రాకేష్‌ఖాన్ పిల్లల వద్దకు చేరుకొని తల్లిదండ్రుల సమక్షంలో వార్డెన్‌కు అప్పగించినట్లు సీఐ నాగరాజుగౌడ్ తెలిపారు.

సొంత డబ్బుతో తండాకు రోడ్డు


చిన్నతండా వరకు మట్టి పోయిస్తున్న యువకులు

షాబాద్, ఆగస్టు 12: యువకులు సొంత డబ్బు వెచ్చించి పోతుగల్ చిన్నతండా వరకు మట్టి రోడ్డును వేసుకున్నారు. పోతుగల్ స్టేజి నుంచి తండా వరకు 1కిలోమీటర్ పొడవు రోడ్డుపై మట్టి పోసి గుంతలు పూడ్చేయించారు. తండా వాసుల ఇబ్బందులను చూడలేక రోడ్డుపై మొరం పోయించామని యువకులు గోపాల్, మోహన్, శ్రీకాంత్, పాండు, ఎం.పాండు, రాజు, మచ్చునపల్లి శ్రీధర్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి అశోక్ ఉన్నారు.

నేటి విజయోత్సవ ర్యాలీకి మాదిగలు తరలిరావాలి

షాబాద్/మొయినాబాద్ రూరల్/షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 12 : ఈ నెల 13న చలో హైదరాబాద్ విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేద్దామని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు విశ్వం మాదిగ అన్నారు. సోమవారం షాబాద్‌లో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం గత 30 సంవత్సరాలుగా ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పోరాట ఫలితంగా నేడు ఎస్సీవర్గీకరణ కోసం సుప్రీంకోర్టు సానుకూల తీర్పు ఇవ్వడం పట్ల విజయోత్సవర్యాలీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎంఆర్‌పీఎస్ జిల్లా కార్యదర్శి శివశంకర్ మాదిగ, మండల నాయకులు ప్రవీణ్‌కుమార్, మహేందర్, రాములు, జగన్, శేఖర్, సురేష్, రమేష్ పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ విజయోత్సవ ర్యాలీకి ఎమ్మార్పీఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివెళ్దామని ఎమ్మార్పీఎస్ మొయినాబాద్ మండల అధ్యక్షుడు కొండిగారి మహేందర్ పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణను విజయవంతం చేసి హైదరాబాద్‌కు వస్తున్న మంద కృష్ణ మాదిగకు స్వాగతం పలికేందుకు ఎమ్మార్పీఎస్ విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటన్నోళ్ల నర్సింహ మాదిగ కోరారు. షాద్‌నగర్ మాట్లాడుతూ.. నేటి ఉదయం 11గంటలకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు వచ్చి ర్యాలీలో పాల్గొని మంద కృష్ణకు స్వాగతం పలకాలని కోరారు.

పంటలు ఎండకుండా చూడాలి

కడ్తాల్, ఆగస్టు 12: రావిచెడ్ పంచాయతీ మద్దెల కుంట తండాలో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి పంటలు ఎడిపోకుండ చూడాలని రైతులు విద్యుత్ శాఖ అధికారులను కోరారు. సోమవారం ప్యాక్స్ డైరెక్టర్ శ్రీనివాసులుతో కలిసి విద్యుత్‌ఉపకేంద్రంలో ఏఈ నరేందర్‌కు వినతి పత్రం ఇచ్చారు. మద్దెల కుంట తండాకు చెందిన 16మంది రైతులు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ కోసం నాలుగు నెలల క్రితం డీడీలు కట్టామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ మంజూరైనా మెటిరీయల్ ఇవ్వలేదన్నారు. త్వరగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి పండలు ఎండకుండా చూడాలని రైతులు కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో రైతులు భాస్కర్, శ్రీను, శంకర్, రవి, డాక్య, బాలు, వాచ్య, హన్య తదితరులు ఉన్నారు.

మొక్కలతోనే మానవాళి మనుగడ

ఆమనగల్లు, ఆగస్టు 12 : మొక్కల పెంపకంపైనే మానవాళి మనుగడ ఆధారపడి ఉందని లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్‌లు నటరాజ్‌యాదయ్య, ఎం.చంద్రశేఖర్, జూలూరి రమేష్ అన్నారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ సంకటోనిపల్లిలో సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డితో కలిసి యాదయ్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. 350మొక్కలు నాటారు. మొక్కల పెంపకం సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి పెంచాలన్నారు. మొక్కలు నాటడం వల్ల వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని తెలిపారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏటా మొక్కలు నాటి సంరక్షిస్తున్నట్లు లక్ష్మారెడ్డి తెలిపారు. రెండు సిమెంట్ బెంచీలను బహుకరించారు. కార్యక్రమంలో క్లబ్ పీఆర్వో పాషా, కార్యదర్శి మహేశ్, కోశాధికారి గుజ్జరి నర్సింహ, సభ్యులు రాంరెడ్డి, కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న యాదయ్య

అపరిచితులతో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి


సైబర్ మోసాలపై విద్యారులకు వివరిస్తున్న ఏఎస్ఐ గోపాల్‌రెడ్డి

చౌదరిగూడ, ఆగస్టు 12 : జిల్లేడ్ చౌదరిగూడలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ అవేర్నెస్, క్రమశిక్షణ, గోల్ ఏర్పాటు, లీడర్‌షిప్ లక్షణాలు, సెల్‌ఫోన్ వినియోగం వల్ల అనర్థాలు, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ బాల్య వివాహాల నివారణ, షీ టీమ్, డయల్ 100 అంశాలపై సోమవారం ఏఎస్ఐ గోపాల్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గోల్ పెట్టుకొని చదువుకోవాలని, చదువుతోపాటు క్రమశిక్షణ కలిగి తల్లిదండ్రులను, పెద్దలను, గురువులను గౌరవించాలన్నారు. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, కొత్త వ్యక్తులు చెప్పే మాయమాటలకు మోసపోవద్దని సూచించారు. సైబర్ మోసాలు పెరిగిపోయాయని, తమ బంధువులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎం సునీత, ఉపాధ్యాయులు నరేందర్, శ్రీనివాస్, శంకర్, లావణ్యలత, పార్వతమ్మ, శైలజ, సుశీల, భానుచంద్ర, షీ టీం పోలీసులు సురేష్, కృష్ణ, అనంతయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమానికి కృషి


లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు, ఆగస్టు 12 : ప్రతీ నిరుపేద సంక్షేమం కోసం రాజకీయాలకు అతీతంగా తాను కృషిచేస్తున్నట్లు మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. మహిళలకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మీర్‌పేటలోని క్యాంప్ కార్యాలయంలో సోమవారం అందజేశారు. ప్రతీ హామీని నెరవేర్చి గ్రామీణ,పట్టణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం తో పోల్చుకుంటే ఈ ప్రభుత్వంలో పేదలకు తగిన సాయం అందడంలేదన్నారు. సీఎంఆర్ఎఫ్ అమలుపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్, వైస్ చైర్మన్ జి.విజయేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జయేందర్, ఏఎంసీ మాజీ చైర్మన్లు సురేందర్‌రెడ్డి, జి.లక్ష్మీనర్సింహారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మేఘనాథ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, ఆనంద్, రామకృష్ణారెడ్డి, కాకి ఇందిరదశరథ్, జ్యోతిచంద్రశేఖర్, గోవర్ధన్, సందీశ్వర్, ఇందిర దేవేందర్, రా ములు, ప్రభాకర్‌రెడ్డి, బొక్క దీక్షిత్‌రెడ్డి, సామ య్య, పిట్టల యాదయ్య, దేవీలాల్‌నాయక్, ఎస్ ప్రకాశ్‌రెడ్డి, దర్శన్‌రెడ్డి, డికెఆర్, లక్ష్మణాచారి, కొండల్‌రెడ్డి, తేజనాయక్, రమేష్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు

ఎంఈవో పోస్టులను భర్తీ చేయాలి


చేవెళ్లలో సభ్యత్వం నిర్వహిస్తున్న నాయకులు

చేవెళ్ల, ఆగస్టు 12: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఎంఈవో పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయాలని ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎస్.నర్సింహ డిమాండ్ చేశారు. సోమవారం చేవెళ్లలోని బాలుర పాఠశాలలో సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలలా వా రీగా ఎంఈవో పోస్టులు చాలా ఏళ్లగా ఖాళీగా ఉండడంతో పాఠశాలలపై పర్యవేక్షణ తగ్గిందన్నారు. తక్షణమే ఎంఈవో పోస్టులను భర్తీచేయాలన్నారు. కార్యక్రమంలో జీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయ సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

కేశంపేట, ఆగస్టు 12: సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సమగ్ర శిక్షా అభియాన్ మండలాధ్యక్షుడు ఎల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం కేశంపేట కస్తూర్బా గాంధీ విద్యాలయం వద్ద నివాళులు అర్పించారు. సమగ్ర శిక్షా అభియాన్‌లో పని చేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే నిరసనలు చేపడతామని హెచ్చరించారు.


ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడిగా

నడికూడ శివ

మహేశ్వరం, ఆగస్టు12: మహేశ్వరం మండల నాగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన నడికూడ శివను ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షునిగా నియమించినట్లు మాజీ ఎమ్మెల్యే మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కేఎల్లార్ తెలిపారు. సోమవారం తుక్కుగూడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శివకు సంబంధిత నియామక పత్రాన్ని ఆయన అందజేశారు.

ప్రజా సమస్యలు పరిష్కరించని ప్రభుత్వం

శంకర్‌పల్లి, ఆగస్టు 12: ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో, సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్‌కుమార్ గౌడ్ అన్నారు. శంకర్‌పల్లిలోని డీఎమ్మార్ గార్డెన్‌లో పార్టీ మండల అధ్యక్షుడు రాములుగౌడ్ అధ్యక్షతన సోమవారం విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం షరతులు విధించడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు కంజర్ల ప్రకాశ్, ప్రభాకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి. గోవర్ధన్‌రెడ్డి, వాసుదేవ్, పరమేశ్వర్‌రెడ్డి. కృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, డి.రామ్మోహన్, సురేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అంజన్‌కుమార్‌గౌడ్

మాల మహానాడు జిల్లా అధ్యక్షుడిగా బండి మహేష్

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 12: రంగారెడ్డి జిల్లా మాల మహానాడు అధ్యక్షుడిగా ఇబ్రహీంపట్నానికి చెందిన బండి మహేష్‌ను నియమించారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి, రాష్ట్ర అధ్యక్షుడు చిక్కుడు గుండాలు సోమవారం ఆయనకు నియామకపత్రం అందజేశారు. షెడ్యూలు కులాల హక్కుల పరిరక్షణకోసం తన వంతుగా కృషిచేస్తానని మహేష్ తెలిపారు. మండలాలు, మున్సిపాలిటీల కమిటీలు వేస్తామన్నారు.

ట్రిపుల్ ఐటీల్లో సీటు సాధించిన మోడల్ స్కూల్ విద్యార్థులు

మహేశ్వరం, ఆగస్టు 12: మహేశ్వరంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో 2023-24 విద్యాసంవత్సరంలో ఇంటర్‌మీడియట్ పూర్తి చేసుకున్న ఇద్దరు విద్యార్థులు ఐఐఐటీల్లో సీటు సాధించారు. ఎంపీసీ విద్యార్థి మునావత్ సిద్ధు, కాట్రావత్ శివ ఐఐటీ, జేఈఈ అడ్వాన్స్ పరీక్షలో ప్రతిభ కనబరిచి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో సీట్లు సాధించారు. సోమవారం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ధనుంజయ్ మాట్లాడుతూ త్రిపుర, మణిపూర్ రాష్ట్రాల్లోని యూనివర్సిటీల్లో సీట్లు సాధించిన ఆ విద్యార్థులకు, వారిని ప్రోత్సహించిన ఉపాధ్యాయులను శుభాకాంక్షలు చెప్పానన్నారు.

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా రాచమల్ల యాదగిరి

శంషాబాద్, ఆగస్టు 12: శంషాబాద్‌కు చెందిన రాచమల్ల యాదగిరిని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నియమితులయ్యారని పార్టీ మండల కార్యదర్శి నర్రాగిరి సోమవారం తెలిపారు. శంషాబాద్‌లో జరిగిన పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఈ నియామకం జరిగిందన్నారు. యాదగిరికి పూల బొకే ఇచ్చి సన్మానించినట్లు తెలిపారు.

ఎస్ఐకు నాయకుల సన్మానం



కేశంపేట, ఆగస్టు 12: కేశంపేట పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా బాధ్యతలు తీసుకున్న రాజ్ కుమార్‌ను సోమవారం కాం గ్రెస్ సీనియర్ నాయకులు అబ్బి సుందరయ్య, దిద్దెల లక్ష్మయ్యలు సన్మానించారు. పోలీస్ స్టేషన్‌లో ఎస్సైని కలిసిన నాయకులు శాలువతో సత్కరించారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేయాలని కోరారు.

'కార్యకర్తల కుటుంబాలకు బీఆర్ఎస్ అండ'

తలకొండపల్లి, ఆగస్టు 12: కార్యకర్తల కుటుంబాలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని, వారికి ఏ కష్టం వచ్చినా ఆదుకుంటుందని పార్టీ రాష్ట్ర నాయకుడు సీఎల్.శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. చంద్రధనకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు కటికెల కుమార్‌యాదవ్ ఇటీవ్వలమృతిచెందాడు. సోమవారం కుమార్ మృతదేహానికి శ్రీనివాస్ నివాళులర్పించారు. మృతుని కుటుంబాన్ని పరామర్శించి మనో ధైర్యం కల్పించారు. పరామర్శించిన వారిలో నాయకులు విజయ్ కుమార్ రెడ్డి, రాములు, వెంకటయ్య, లింగం గౌడ్, జంగయ్య, శేఖర్, యాదయ్య, రాజు, శ్రీను, తదితరులు ఉన్నారు.

'కాలేజీకి ప్రహరీ నిర్మించాలి'

చేవెళ్ల, ఆగస్టు 12: చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ప్రహరీగోడ నిర్మించాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బి.అరుణ్‌కుమార్ అన్నారు. సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కళాశాలలోని విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. డిగ్రీ కళాశాలకు ప్రహరీ లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రహరీ లేక తరగతి గదుల్లోకి పాములు, పశువులు వస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వం ప్రహరీ నిర్మించాలని డిమాండ్ చేశారు.

● షాద్‌నగర్ అర్బన్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరశిస్తూ బుధవారం ఉదయం 10గంటలకు షాద్‌నగర్‌లో ర్యాలీని నిర్వహిస్తామని హిందూ సంఘాల ఐక్యవేదిక నాయకులు పేర్కొన్నారు.

సంక్షిప్తంగా...

● శంషాబాద్ రూరల్: శంషాబాద్ మండలంలోని చిన్న గోల్కొండ పీఏసీఎస్ చైర్మన్ బొమ్మ దవనాకర్‌గౌడ్ సోమవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 22మంది రైతులకు రుణమాఫీ చెక్కులను అందించారు. 22మంది రైతులకు రూ.15.85లక్షలు రుణమాఫీ అయిందన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ డైరెక్టర్ మంచర్ల మోహన్‌రావు, సీఈవో యాదయ్య, సిబ్బంది సురేశ్, మధుమతి, జగపతిబాబు, అనంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పద్మ, కమ్మరి పాండురంగచారి, శంకర్, శ్రీనివాస్‌చారి తదితరులు పాల్గొన్నారు.

● కేశంపేట: ధర్మ సమాజ్ పార్టీ(డీఎస్పీ) కేశంపేట మండల కన్వీనర్‌గా కొత్తపేటకు చెందిన మహిపాల్‌ను ఎన్నుకున్నారు. కేశంపేటలో నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి బరిగల దుర్గాప్రసాద్, జిల్లా కన్వీనర్ రాకేష్‌ల నేతృత్వంలో మహిపాల్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల ఇంచార్జీ రమేష్, నాయకులు కృష్ణ, నరేష్, విష్ణు, ఆనంద్, శ్రీకాంత్, రాజు, రమేష్, తిరుపతి, కృష్ణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

● ఆమనగల్లు: ఒకరి నేత్ర దానంతో ఇద్దరికి దృష్టి భాగ్యం కలుగుతుందని, ప్రతి ఒక్కరు మరణానంతరం నేత్రదానం చేయడానికి ముందుకు రావాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. అంధత్వ నివారణ కార్యక్రమాన్ని లయన్స్‌క్లబ్ ఉద్యమ స్ఫూర్తితో ముందుకు తీసుకుపోతుందని పేర్కొన్నారు. ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఎనుగొండ రాంరెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రి, ఆమనగల్లు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి ప్రారంభించారు. 75 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 25మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించి ఐఓఎల్ ఆపరేషన్ల నిమిత్తం ఎనుగొండ రాంరెడ్డి ఆసుపత్రికి తరలించినట్లు లయన్స్‌క్లబ్ పీఆర్‌వో పాషా తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్‌లు నటరాజ్‌యాదవ్, రమేశ్, కోశాధికారి గుజ్జరి నర్సింహ్మా, డాక్టర్ పరీక్షిత్ నరేందర్, సభ్యులు కర్నాటి కొండల్ రెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

● ఆమనగల్లు: విద్య, ఉపాధి, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో ఆర్యవైశ్యులు మరింత రాణించాలని సంఘ సేవకుడు, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము ఆకాంక్షించారు. పేద ఆర్యవైశ్య కుటుంబాలకు ప్రభుత్వాలు తోడ్పాటునందించాలని కోరారు. ఆమనగల్లుకు చెందిన గార్లపాటి కృష్ణయ్య కుమారుడు సాయికిరణ్ ఆర్‌అండ్‌బీ శాఖలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా ఉద్యోగం సాధించాడు. సాయికిరణ్‌కు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లిదండ్రుల ఆశయాలకనుగుణంగా విద్యార్థులు పట్టుదలతో చదివి ఉద్యోగాలు సాధించాలని కోరారు. అలాగే సాయికిరణ్‌ను ఆర్యవైశ్య సంఘం నాయకుడు కండె సాయి సత్కరించారు.

● మంచాల: గ్రామాల్లో ప్రజాసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యుడు సిలివేరు రాజు యంత్రాంగాన్ని కోరారు. మంచాల మండల పరిధి అంబోత్‌తండా పార్టీ గ్రామ శాఖ అధ్వర్యంలో క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. తండాలో డ్రైనేజీ, వీధిలైట్లు, సీసీ రోడ్ల సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్.రాజు మాట్లాడుతూ మురుగు నీరు రోడ్లపై పారి దుర్గంధం వస్తోందన్నారు. పేదలకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. సీపీఎం గ్రామశాఖ కార్యదర్శి రవీందర్, ఎస్ఎఫ్ఐ అధ్యక్షకార్యదర్శులు సురేష్, రాజేష్, గోవింద్, సాయి, విగ్నేష్, నితిన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

● కొందుర్గు: సమాజంలో ఉపాధ్యాయులు పాత్ర ఎంతో కీలకమని మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్ అన్నారు. మండల కేంద్రంలోని దళితవాడ ప్రాథమిక పాఠశాల నుంచి ఇటీవల బదిలీపై ఇతర పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులు ప్రేమ్ సాగర్, అనూరాధలను సోమవారం పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ప్రధానోపాధ్యాయురాలు అనురాధ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో 12సంవత్సరాలుగా ఉపాధ్యాయులు చేసిన సేవలను గ్రామస్థులు, విద్యార్థులు కొనియాడారు. మాజీ వైస్‌ఎంపీపీ రాజేష్ పటేల్ మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని, వారి సేవాకాలంలో చేసిన సేవలతోనే ఉపాధ్యాయులకు గుర్తింపు వస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో కిష్టారెడ్డి, హెచ్‌ఎంలు గోపీనాథ్, వెంకట్‌రెడ్డి, గ్రామస్తులు మాణయ్య, నరేందర్, శ్రీను, సుందర్, వాసురి, సుధాకర్‌గౌడ్ పాల్గొనారు.

● శంషాబాద్: శంషాబాద్ మున్సిపాలిటీకి ట్యాంకర్ నీటిని సొంతానికి వాడుకుంటున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని మధురానగర్‌బస్తీకి చెందిన పాపారాయుడు మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావుకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.